సాక్షి చిత్తూరు

శనివారం । 18 । నవంబర్ । 2023



సాంకేతికత అవసరం

వ్యవసాయంలో సాంకేతికత వినియోగం అవసరమని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. - 8లో



అంబరాన్నంటే సంబరం

మంత్రి ఆర్‌కే రోజా పుట్టిన రోజు వేడుకలను అతిథులు, అభిమానుల నడుమ శుక్రవారం నిర్వహించారు. - 8లో



ఐరాలలో డెంగీ కేసు

ఐరాలలో శుక్రవారం డెంగీ కేసు నమోదైంది. జిల్లా మలేరియా నివారణ అధికారి వెంటనే బాధితుడిని పరామర్శించారు. - 8లో

న్యూస్‌రీల్

పాల కేంద్రాల పనులు వేగవంతం



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్స్(ఏఎంసీయూ), బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్స్(బీఎంసీయూ) పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన ఏఎంసీయూ, బీఎంసీయూ యూనిట్‌లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆరు మండలాల్లో 108 ఏఎంసీయూ కేంద్రాలను ప్రారంభానికి సిద్ధం చేయాలని చెప్పారు. పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఆరు బీఎంసీయూ కేంద్రాలను డిసెంబర్‌లో ప్రారంభించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో డెయిరీ డెవలప్‌మెంట్ అధికారి రవిచంద్రన్, డీసీఓ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలపై సీరియస్

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం సీరియస్ అయినట్లు తెలిసింది. ఈనెల 14వ తేదీన రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ నరసింహులు, వైఎస్సార్ యూహెచ్‌ఎస్ వైస్ చాన్స్‌లర్ బాబ్జి ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈ మేరకు తమ నివేదికను వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుకు అందించారు. ఆయన పరిశీలించి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అధికారులు, అపోలో నిర్వాహకులు విజయవాడలోని కార్యాలయానికి పిలిపించి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. రెఫర్ కేసులను పూర్తిగా తగ్గించాలని, మందులు, మాత్రలు బయటకు రాసి ఇవ్వకూడదని, ఓపీ విభాగంలో మార్పు తీసుకురావాలని, ముఖ్యంగా పారిశుద్ధ్యం విషయంపై శ్రద్ధ వహించాలని, స్కానింగ్, ల్యాబ్ పరీక్షలకు బయటకు సిఫార్సు చేయకూడదని ఆదేశించినట్లు సమాచారం.

పకడ్బందీగా కుల గణన సర్వే

పూతలపట్టు : కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించి నివేదికలు అందించాలని బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి ఆదేశించారు. శుక్రవారం పూతలపట్టు ఎంపీడీఓ కార్యాలయంలో కుణ గణనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ల గణ ఆఫీసర్లుగా నియమితులైన వారు గ్రామాల్లో పకడ్బందీగా సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్. డీటీ హిమగిరి, ఏఓ మధురవాణి. ఏపీఎం నాగరత్న, ఏఈ ప్రసాద్ నాయుడు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు

ఉద్యోగుల కోసం ప్రత్యేక 'స్పందన'

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నట్లు డీఆర్‌ఓ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల స్పందన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక స్పందన నిర్వహిస్తోందన్నారు. ప్రతి నెల 3వ శుక్రవారం నిర్వహించే స్పందనలో అర్జీలు స్వీకరించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. నేటి స్పందనకు 7 అర్జీలు వచ్చాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

సాహో.. సురక్ష

ప్రజారోగ్య రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఉచితంగా అత్యున్నత వైద్యసేవలు అందించేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టింది. తొలుత ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వలంటీర్లతో సర్వే చేపట్టింది. అనంతరం ఆయా సచివాలయాల పరిధిలో హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేసి నిపుణులైన వైద్యులతో చికిత్సలు చేయించింది. కావాల్సిన మందులు పంపిణీ చేసింది. అవసరమైన వారికి శస్త్రచికిత్సల కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు రెఫర్ చేసి పైసా ఖర్చు లేకుండా ట్రీట్‌మెంట్ చేయిస్తోంది. ఈ క్రమంలో సర్కారు చిత్తశుద్ధిపై ప్రజానీకం హర్షాతిరేకం వ్యక్తం చేస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా సేవలందించడంపై ప్రశంసల జల్లు కురిపిస్తోంది.

- జిల్లావ్యాప్తంగా 45 రోజులపాటు మెడికల్ క్యాంపులు
- జగనన్న ఆరోగ్య సురక్ష కింద మెరుగైన వైద్యసేవలు
- క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించిన స్పెషలిస్ట్ డాక్టర్లు
- అవసరాల మేరకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు



వైద్యశిబిరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

సాక్షి, చిత్తూరు : ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తూ.. దేశంలోనే తొలిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న పథకానికి శ్రీకారం చుట్టారు. జగనన్న ఆరోగ్య సురక్ష కింద క్షేత్రస్థాయిలో రోగులకు వైద్యసేవలందించేలా కార్యక్రమం చేపట్టారు. ముమ్మరంగా 45 రోజులు పాటు వ్యాధిగ్రస్తులు తమ ఇళ్ల వద్దే కార్పొరేట్ వైద్యసేవలు అందుకున్నారు. ప్రత్యేక వైద్య నిపుణులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు మెరుగైన సేవలందించారు. మరికొందరు రోగుల పరిస్థితి మేరకు కార్పొరేట్ పైస్థాయి ఆస్పత్రుల్లో వైద్యానికి సిఫార్సు చేశారు. అలాంటి వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా సేవలు, శస్త్ర చికిత్సలు అందించారు.

ఇంటింటికీ వెళ్లి..

జిల్లావ్యాప్తంగా వలంటీర్లు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ముందుగా పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య క్యాంపులకు వచ్చేందుకు టోకెన్లు పంపిణీ చేశారు. ఎప్పుడు ఏ వైద్య నిపుణుడు వస్తారో ముందుగానే అందులో వివరంగా పేర్కొన్నారు.జిల్లాలోని రూరల్ ప్రాంతాల్లో 464, అర్బన్ ఏరియాల్లో 30 సురక్ష హెల్త్ క్యాంపులు నిర్వహించారు. ఆయా వైద్యశిబిరాల్లో 7 రకాలు పరీక్షలు నిర్వహించారు. సుమారు 175 రకాల మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ క్రమంలో మొత్తం 14,24,477 మంది వైద్యసేవలు పొందారు. సుమారు 2,688 మందిని కార్పొరేట్, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. అందులో వెయ్యిమంది ఇప్పటికే చికిత్స చేయించుకున్నారు. మిగిలిన వారికి కూడా సత్వరమే వైద్యం అందించేందుకు ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

జిల్లా సమాచారం

మొత్తం వైద్యసేవలందుకున్న వారు	14,12,477 మంది
నిర్వహించిన మెడికల్ క్యాంపులు	494
ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేయబడిన వారు	2,688
ఆయా హాస్పిటళ్లలో ఇప్పటికే చికిత్స పొందిన వారు	623
రక్తహీనత పరీక్షలు చేయించుకున్నవారు	7,35,242
రక్తపోటు బాధితులు	10,772
కంటి వెలుగు పరీక్షలు చేయించుకున్నవారు	27,367
కళ్ల జోళ్లు పొందిన వారు	17,382
గుర్తించిన క్యాటరాక్ట్ కేసులు	1,962
కళ్లకు చేసిన శస్త్రచికిత్సలు	224

మెరుగైన సేవలు



ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం భారీ స్థాయిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. వలంటీర్ నుంచి ప్రత్యేక వైద్యుల వరకు శ్రమించి ప్రజలకు అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా, వైద్య శిబిరాలను విజయవంతం అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారు.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

అనూహ్య స్పందన



ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు అనూహ్య స్పందన వచ్చింది. పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి చికిత్సలు పొందారు. రోగులకు ఉచిత వైద్యంతో పాటు మందులు కూడా అందించాం. శస్త్ర చికిత్సలు అవసరమైతే రోగులు ఎంపిక చేసుకున్న ఆస్పత్రిలోనే సర్జరీ చేయించుకునేలా చర్యలు చేపట్టాం. ఈ మేరకు ఆరోగ్య శాఖ బృందాలు వారికి సహకరిస్తున్నాయి.

– రాజశేఖర్ రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా అధికారి,

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



నేను కడుపు నొప్పితో బాధపడేదాన్ని. మా గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య శిబిరానికి వెళితే వారు కుప్పం లోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఉచితంగా సర్జరీ చేయించారు. వారం తర్వాత డిశ్చార్జ్ చేసి అంబులెన్స్‌లో మా ఇంటి దగ్గర దింపి వెళ్లారు. పైగా నాకే రూ.3వేలు ఇచ్చారు. మందులు కూడా ఇచ్చారు. ఇంతటి మేలు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. – మంగమ్మ, ననియాల తాండా, రామకుప్పం మండలం

మేలు మరువలేం



నేను చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నా. మా వలంటీర్ ద్వారా ఆరోగ్య సురక్ష క్యాంపునకు వెళ్లా. రక్తహీనత వల్ల నా ఆరోగ్యం దెబ్బతిందని వైద్యులు నిర్ధారించారు. తిరుపతిలో ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఉచితంగానే చికిత్స చేస్తారని చెప్పారు. నా ఆరోగ్యం బాగుపడేందుకు సరైన దారి చూపిన ముఖ్యమంత్రి జగనన్న మేలు ఎన్నటికీ మరువలేం.

– అను, చిన్నతయ్యూరు, ఎస్ఆర్ పురం మండలం

శుభ పరిణామం



జగనన్న ఆరోగ్య సురక్ష కింద వ్యాధిగ్రస్తులకు కావాల్సిన పరీక్షలు, చికిత్సలు, మందులను ఉచితంగా అందించడం శుభ పరిణామం. దేశంలో ఎక్కడా లేని విధంగా మన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజల ఆరోగ్యంపై పాలకులకు ఉన్న చిత్తశుద్ధిని ఈ పథకం తెలియజేస్తుంది. లక్షలాది మంది పేదలకు ఈ పథకం ఎంతో మేలు చేస్తోంది. – జానకి, వైద్యాధికారి, కల్లూరు పీహెచ్‌సీ, పులిచెర్ల మండలం

నాణ్యమైన వైద్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం. ఎక్కడికక్కడ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లతో సేవలు అందిస్తున్నాం. రోగులకు క్షుణ్ణంగా పరీక్షలు చేయించి అత్యున్నతంగా చికిత్సలు చేయిస్తున్నాం. అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలందిస్తున్నాం. ఇప్పటికే సుమారు వెయ్యిమంది వరకు పై ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. – ప్రభావతీదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

మాటల మాయగాళ్లతో అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, పక్కన ఎంపీ రెడ్డెప్ప తదితరులు

శాంతిపురం: మాయమాటలతో ఏమార్చే టీడీపీ నేతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ భరత్ కోరారు. శుక్రవారం మండలంలోని గుంజార్లపల్లెలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్పతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో వందల హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ఏం చేశారో ఇప్పటికీ జనం మరువలేదన్నారు. మహిళలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని నకిలీ ఏటీఎం కార్డులు ఇచ్చి ఓట్లు వేయిచుకున్నారని గుర్తు చేశారు. రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని మోసం చేశారని విమర్శించా. మళ్లీ అలాగే మాయలు చేసేందుకు డ్రామా పార్టీ వారు వస్తున్నారని హెచ్చరించారు. తన భవిష్యత్‌కు, తనను నమ్ముకున్న వారి భవిష్యత్‌కు గ్యారెంటీ ఇవ్వలేని వ్యక్తి జనం భవిష్యత్‌కు ఏం గ్యారెంటీ ఇస్తారో ఆలోచించాలని కోరారు. గతంలో ఇచ్చిన ఏటీఎం కార్డులను నమ్మినట్టు ఈ దఫా భవిష్యత్ గ్యారెంటీ కార్డును నమ్మితే నిండా మునిగిపోతారని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో ప్రతి ఒక్కరికీ చేసిన మేలును వివరించి, మళ్లీ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరుతున్నామని తెలిపారు. నాలుగున్నరేళ్లలో జగనన్న చేసిన మేలును ఎవరూ మరచిపోరన్నారు. మరింత మంచి జరగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా రూ.లక్షలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. గుంజార్లపల్లి పంచాయతీ ప్రజలకు గత నాలుగేళ్లలో రూ.20 కోట్లు పథకాల ద్వారా అందించామని వెల్లడించారు. కరోనా సమయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంట్లో మనిషిగా సేవ చేశారని చెప్పారు. లంచాలు, వివక్ష లేకుండా ఇప్పుడు ఇంటి గడప వద్దనే పథకాలు అందుతున్నాయని, గతంలో జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకున్న వారికి మాత్రమే పనులు జరిగాయని వివరించారు. త్వరలోనే హంద్రీనీవా ద్వారా కుప్పం చెరువులకు నీరు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీ పట్టాభి, ఎంపీటీసీ సభ్యులు రవిరెడ్డి, బీఎస్ వెంకటేశు, చలం, నాయకులు సోమారెడ్డి, కోదండరెడ్డి, రమేష్, భాస్కర్, మురుగేష్ పాల్గొన్నారు.

సామాజిక బస్సు యాత్రపై సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పలమనేరు : పట్టణంలో ఈనెల 25న నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక బస్సు యాత్ర నిర్వహణపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు శుక్రవారం పట్టణ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సమీక్షించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీణ వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ పదవుల్లో, నామినేటెడ్ పోస్టుల్లోనూ బీసీలు, ఎస్సీలకు సముచిత స్థానాన్ని కల్పించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పార్టీ కార్యదర్శి బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, పార్టీ పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీ సుధా పాల్గొన్నారు.

స్థల పరిశీలన

బస్సు యాత్ర సభ కోసం ఎమ్మెల్యే వెంకటేగౌడ శుక్రవారం స్థల పరిశీలన చేపట్టారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, జాఫర్ పాల్గొన్నారు.

విశ్వంలో రేపు ఉచిత అవగాహన సదస్సు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో ఆదివారం ఉదయం 9గంటలకు సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్షలకు సంబంధించి అవగాహన సదస్సును ఉచితంగా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు ప్రస్తుతం 4, 9వ తరగతి చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనవచ్చని, ఈ సదస్సులో ఆయా ప్రవేశ పరీక్షలకు సంబంధించి పూర్తి వివరాలు, దరఖాస్తు చేసుకునే విధానంపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 93999 76999, 86888 88802 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

19 నుంచి ఓపెన్ వర్సిటీ తరగతులు

చిత్తూరు కలెక్టరేట్ : అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ తరగతులను ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు కో–ఆర్డినేటర్ మీరాసాహెబ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డిగ్రీ మూడో సెమిస్టర్ తరగతుల అభ్యర్థులు కచ్చితంగా హాజరుకావాలన్నారు. వివరాలకు 7382929664 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ధీరజ్ కుటుంబానికి మంత్రుల పరామర్శ

చిత్తూరు కార్పొరేషన్: ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, చిత్తూరుకు చెందిన కట్టమంచి ధీరజ్‌రెడ్డి(35) గుండె సమస్యతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం కన్నుమూశారు. శుక్రవారం స్థానిక కట్టమంచిలోని ధీరజ్ నివాసంలో కుటుంబ సభ్యులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణమూర్తి పరామర్శించారు. ధీరజ్ లేని లోటు తీరనిదని సంతాపం వెలిబుచ్చారు.



ధీరజ్ తల్లిదండ్రులు రాణి, రామ్మూర్తిరెడ్డి, భార్య అనుషిక్త రెడ్డి, సోదరి హరిణికి ధైర్యం చెప్పారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, నాయకులు భూపేష్, ఎల్‌బీఐ లోకేష్‌రెడ్డి సంతాపం తెలిపారు.

జనవాక్కు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంతో జిల్లాలో వేలాదిమంది సొంతింటి కల నెరవేరింది. గూడు లేని నిరుపేదలకు శాశ్వత ఆశ్రయం లభించింది. ముఖ్యంగా ఆడపడుచులకు మోముపై చిరునవ్వులు తీసుకువచ్చింది. మహోన్నత ఆశయంతో మొదలుపెట్టిన పథకంపై జనవాక్కు. - చిత్తూరు కలెక్టరేట్

కల నెరవేరె..!



ప్రభుత్వం నిర్మించిన ఇల్లు

సొంత ఇంట్లో చేరా



నా వివాహ జీవితం ప్రారంభమైన నాటి నుంచి అద్దె ఇంట్లోనే ఉన్నా. రూ.150 అద్దె చెల్లించే రోజుల నుంచి రూ.5,500 అద్దె చెల్లించే వరకు బాడుగ ఇంట్లోనే ఉంటున్నాం. నా భర్త రోజు కూలీ మాకు సొంత ఇల్లు అన్నది కలగానే ఉండేది. జగనన్న చలువతో నాకు పట్టా ఇచ్చి స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సహకారం అందించారు. మంత్రి రోజా సహాయంతో కాంట్రాక్టర్ ద్వారా ఇల్లు నిర్మించుకున్నాం. ప్రస్తుతం ఆ సొంతిట్లో చేరాం. ఇప్పుడు హాయిగా జీవనం సాగించగలమనే భరోసా వచ్చింది. – జి.శాంతి, లబ్ధిదారు, నగరి

అద్దె ఇంట్లో ఇబ్బందులు పడ్డాం



మేము పలమనేరు పట్టణంలోని ఎంసీఆర్ నగర్‌లో 30 ఏళ్లుగా అద్దె ఇళ్లల్లోనే కాపురం ఉన్నాం. ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఈ ప్రభుత్వంలో మాకు ఇల్లు, స్థలం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి సకాలంలో బిల్లులందాయి. దీంతో సొంత గూడు నిర్మించుకున్నాం. మాకు సొంతిల్లుంది అనుకుంటేనే చాలా సంతోషంగా ఉంది. ఎవరెన్ని మాట్లాడినా నా సొంతింటి కల జగనన్న ద్వారానే నిజమైంది. నేను ఎన్నటికీ జగనన్నను మరచిపోను. – బీబీజాన్, లబ్ధిదారు, పలమనేరు

రుణపడి ఉంటాం



మేము ఇప్పటి వరకు అద్దె ఇళ్లలోనే ఉన్నాం. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం ఎన్నో అర్జీలు ఇచ్చాం. కార్యాలయాల చుట్టు కాళ్లు అరిగేలా తిరిగాం. అయినా వారు కనికరించలేదు. ఈ రోజు రేపు అంటు చెప్పారే తప్ప స్థలం, ఇల్లు ఇవ్వలేదు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే మేము ఇంటి స్థలం కోసం అర్జీ పెట్టుకున్నాం. ఇంటి స్థలం ఇచ్చారు. సకాలంలో బిల్లులు మంజూరు చేయడంతో ఇళ్ల నిర్మించుకున్నాం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. – ఫజానా, తగ్గువారిపల్లె, బంగారుపాళ్యం మండలం

జగనన్నకు కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని సొంత స్థలం వచ్చింది. పక్కా గృహం కూడా మంజూరు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సహాయం చేశారు. జగనన్నకు కృతజ్ఞతలు .- శారద, తాటిమోకులపల్లె, పెనుమూరు మండలం

13 మంది విద్యార్థులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థులు

తవణంపల్లె : మండలంలోని దిగువ మోదలపల్లె పంచాయతీ జీ.వడ్డిపల్లెకు చెందిన 13 మంది విద్యార్థులు పెద్దభూపాలం చెట్టు కాయలు తినడంతో అస్వస్థతకు గురయ్యారు. తల్లిదండ్రులు అప్రమత్తమై వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిడంతో పిల్లలు ప్రాణాప్రాయస్థితి నుంచి బయట పడ్డారు. వివరాలు.. జీ.వడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇంటికి వస్తూ గాలివానచెరువు సమీపంలో ఉన్న పెద్దభూపాలం చెట్టులో కాయలు కోసి తిన్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత అందరికీ వాంతులు, విరేచనలు కావడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం విద్యార్థులు దేవేంద్ర, చరణ్, రోహిణి, సోము, శాని, చైత్ర, పవన్, నితిన్, కార్తీక్, లోహిత్, లావణ్య, దర్శిణి, చరణ్ ఆరోగ్యంగా ఉన్నారు.

ఐరాలలో డెంగీ కేసు

ఐరాల: మండల కేంద్రంలోని వీఎస్ అగ్రహారం (అరుణనగర్ కాలనీ)లో బావా జాన్ అనే వ్యక్తి డెంగీ బారిన పడినట్లు జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలతతో కలిసి ఆయన బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణలో సైఫోత్రిన్ మందు పిచికారీ చేయించారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఏడీస్ లార్వా సర్వే నిర్వహించి అబేటు మందు పిచికారీ చేయించారు. మలేరియా నివారణ అధికారి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ క్రమంలోనే బాల, బాలికల హస్టల్స్‌ను తనిఖీ చేశారు. దోమలు రాకుండా ప్రతి గదికి మెష్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, సీహెచ్ఓ సుగుణ, పీహెచ్ఎన్ జీవకళ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరం

- ఘనంగా మంత్రి రోజా జన్మదినోత్సవం

నగరి : పుత్తూరు– నగరి మార్గంలోని జీవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంత్రి ఆర్‌కే రోజా పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులకు స్వాగతం పలికిన కళాకారుల కోలాటాలు, డప్పు వాయిద్యాలు కనువిందు చేశాయి. కొయంబత్తూరు నుంచి వచ్చిన గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత అనూష చేసిన నెమలి నాట్యం, పాటలు, జబర్దస్త్ నటులు రాకేష్, వర్ష పండించిన హాస్యం, ఢీ ఫేం కళాకారులు చేసిన నృత్యాలు, జానపద నృత్యాలు, గాయకుడు మనో పాడిన పాటలు, వైఎస్సార్‌సీపీ గీతాలు అంటూ అలరించాయి. మంత్రి రోజాపై చేసిన వీడియో అందరినీ ఆకర్షించింది. ఆమె జీవిత విశేషాలను వివరిస్తూ ముద్రించిన పుస్తకాన్ని టీడీడీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, మంత్రి అంబటి రాంబాబు ఆవిష్కరించారు. మంత్రి రోజా పుట్టిన రోజు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. మంత్రి రోజా మాట్లాడుతూ నగరి ప్రజల ఆశీర్వాదమే నేడు మంత్రిగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోగలిగామన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి, మంత్రిగా అవకాశం కల్పించిన జగనన్నను జీవితాంతం మరువలేనని తెలిపారు.



కేక్ కట్‌చేస్తున్న మంత్రి రోజా, పక్కన టీటీడీ బోర్డు చైర్మన్ భూమన, మంత్రి అంబటి తదితరులు

ఆప్యాయతకు చిహ్నం రోజా

నియోజకవర్గ ప్రజలతో పాటు, రాష్ట్ర ప్రజల ఆప్యాయతకు చిహ్నం రోజా అంటూ తమిళనాడు పాఠ్యపుస్తకాల కార్పొరేషన్ చైర్మన్, తమిళ చర్చావేదిక అధ్యక్షుడు డిండుక్కల్ ఐ.లియోని కొనియాడారు. రియాలిటీ, ఒబీడియన్స్, జాయ్‌ఫుల్‌నెస్, అచీవ్‌మెంట్‌లోని మొదటి అక్షరాలను కలిపితే అది రోజా అని వివరించారు. గాయకుడు మనో మాట్లాడుతూ స్నేహితురాలికి శుభాకాంక్షలు చెప్పడానికే యూఎస్ నుంచి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, మున్సిపల్ కమిషనర్లు కె.వెంకట్రామిరెడ్డి, కేఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకథ ఆవిష్కరణ

మంత్రి ఆర్‌కే రోజా ఆత్మకథ అయిన 'రంగుల ప్రపంచం నుంచి రాజకీయాల్లోకి..మీ రోజా సెల్వమణి' పుస్తకాన్ని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు.



రోజా ఆత్మకథను ఆవిష్కరిస్తున్న అతిథులు



మంత్రి రోజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న భూమన



కళాకారుల ప్రదర్శన

నిరుపేద ప్రాణానికి భరోసా



సమీర్

సదుం: మండలంలోని బూరగమంద రామాపురం గ్రామానికి చెందిన కాలేషా కుమారుడు సమీర్(13) లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు నెలలుగా పలు చోట్ల చికిత్స పొందుతున్నాడు. చెన్నైలో పరిశీలించిన వైద్యులు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవాలని, ఇందుకు రూ.17.50 లక్షలు వెచ్చించాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో నిరుపేదలైన బాధితుడి తల్లిదండ్రులు వెంటనే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి తమ బాధ చెప్పుకున్నారు. ఆయన తక్షణమే స్పందించి చికిత్సకు అవసరమైన నగదుకు ఎల్ఓసీ అందించేలా చర్యలు చేపట్టారు. మంత్రి పెద్దమనసుకి బాలుడి కుటుంబీకులు, స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సమావేశం ఉంటుందన్నారు. 1,7,2,4 కమిటీలకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, 3వ కమిటీకి జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, 5వ కమిటీకి తవణంపల్లె జెడ్పీటీసీ సభ్యులు భారతి, 6వ కమిటీ జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య చైర్మన్లుగా వ్యవహరించనున్నట్లు వెల్లడించారు.

చెరువులో వ్యక్తి గల్లంతు

రొంపిచెర్ల: మండలంలోని చిచ్చిలివారిపల్లె పంచాయతీ లోకవారిపల్లె సమీపంలోని చెరువులో శుక్రవారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. వివరాలు.. రావిళ్ల వారిపల్లెకు చెందిన హరిప్రసాద్(38) చేపలు పట్టేందుకు చెరువుకు వెళ్లాడు. దుస్తులు ఒడ్డున పెట్టి చెరువులో దిగాడు. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయాడు. స్థానికులు ఈ విషయం గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కృష్ణయ్య ఘటనాస్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. హరిప్రసాద్ ఆచూకీ దొరకకపోవడంతో శనివారం గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చేపట్టాలని నిర్ణయించారు. హరిప్రసాద్ మద్యానికి బానిస కావడంతో పదేళ్ల క్రితం అతడి భార్యాపిల్లలు వదిలి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

ద్విచక్రవాహనం దగ్ధం



మంటలు ఆర్పుతున్న దృశ్యం

శ్రీరంగరాజపురం : మండలంలోని లక్ష్మీపురం సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో శుక్రవారం ఓ ద్విచక్రవాహనం దగ్ధమైంది. వివరాలు.. సానకుప్పం గ్రామానికి చెందిన రామానుజన్ పెట్రోల్ బంక్‌లో ఆయిల్ పట్టించుకుని జాతీయ రహదారిపైకి రాగానే ద్విచక్రవాహనంలో మంటలు చెలరేగాయి. పెట్రోల్ బంకు సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

నేటి నుంచి అయ్యప్ప గుడిలో అన్నదానం

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో వెలసిన కోటమల్లై అయ్యప్పస్వామి గుడిలో శనివారం నుంచి అన్నదానం ప్రారంభించనున్నట్టు ఆలయ మేనేజర్ భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నదానాన్ని మంత్రి కుటుంబ సభ్యులు ప్రారంభించనున్నట్టు చెప్పారు. అయ్యప్ప మాలధారులతో పాటు సాధారణ భక్తులకు జనవరిలో మకర సంక్రాంతి వరకు మూడు పూటలా అన్న ప్రసాదం వితరణ చేయనున్నట్టు వివరించారు.

వ్యవసాయంలో సాంకేతికత అవసరం



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు

పలమనేరు : వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడం అవసరమని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం పలమనేరు మండలంలోని కొలమాసనపల్లె జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాసెసింగ్‌కు అవసరమైన యంత్రాలను రైతులకు పంపిణీ చేస్తున్నామని, అలాగే వాటి వాడకంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తనాల ఇండెంట్ ఇచ్చామని వెల్లడించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ మంది రైతులు మామిడి సాగు చేస్తున్నారని తెలిపారు. అందులో అంతరపంటల సాగు, తక్కువ ఖర్చుతో మంచి లాభాలు వచ్చే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయసలహామండలి సమావేశాలను వ్యవసాయక్షేత్రాల్లో పెట్టాలని కలెక్టర్ ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని వీటిని రైతులు అందిపుచ్చుకొని కొత్త వంగడాలను పండించి అధిక లాభాలను పొందాలని సూచించారు. జిల్లా వ్యవసాయమండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మామిడి రైతులకు తక్కువ ఖర్చుతో మంచి లాభాలను పొందేలా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పశుసంవర్ధకశాఖ అధికారి ప్రభాకర్ మాట్లాడుతూ పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తుగానే వందశాతం టీకాలను వేయించామని చెప్పారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మామిడిలో బైప్రొడెక్ట్స్ తయారీ ఖర్చును తక్కువ యంత్రాలతో చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సభ్యులు రత్నారెడ్డి, గంగిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఏపీ ఎంఐసీ అధికారి రమణా రెడ్డి, డ్వామా పీడీ గంగాభవానీ, సైంటిస్ట్ రెడ్డి రాము పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ప్రెస్ అకాడమీ చైర్మన్



కొమ్మినేని శ్రీనివాసరావుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సేవించుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆయనకు ఆలయం వద్ద ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులచే ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆర్టీఓ చిన్నయ్య, ఐఅండ్‌పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ పద్మజ, సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం విచ్చేసిన ఆయనను ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్‌క్లబ్ నాయకులు, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ జర్నలిస్టులకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇళ్ల స్థలాల కేటాయింపుపై నిర్ణయం తీసుకున్నారన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ నిబంధనల ప్రకారం ఇంటి స్థలాలు మంజూరు చేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో ఐఅండ్‌పీఆర్ డీడీ పద్మజ, సీనియర్ పాత్రికేయులు రాఘవులనాయుడు, శివప్రసాద్ పాల్గొన్నారు.

24 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



మాట్లాడుతున్న రామచంద్ర తదితరులు

చౌడేపల్లె : స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 24వ తేదీ నుంచి 3 రోజులపాటు అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు టి.రామచంద్ర తెలిపారు. శుక్రవారం ఈ మేరకు హైస్కూల్‌లో ఎంపీపీ రామమూర్తి, వైఎస్సార్‌సీపీ రాజంపేట, చిత్తూరు పార్లమెంట్ విభాగం యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ వరుణ్‌భరత్, పూర్వపు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి సహకారంతో తొలిసారిగా చౌడేపల్లెలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది క్రీడాకారులు రానున్నట్లు వివరించారు. ఈక్రమంలో ఏర్పాట్లు, వసతి , భోజన సదుపాయాలపై చర్చించారు. సమష్టిగా కృషి చేసి క్రీడాపోటీలను విజయవంతం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగరాజురెడ్డి, పూర్వ విద్యార్థులు పిల్లారి జీవన్ ప్రకాష్, కడియాల మహేష్ బాబు, లీలాకుమార్, మురళి, ఈశ్వర్, రాము, విజయ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం





భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే ఆలయం శుద్ధి చేసి మామిడి, వేపాకు, పూలతోరణాలతో ముస్తాబు చేశారు. అనంతరం రాహుకాల సమయంలో విశేష అభిషేకం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చిన అమ్మవారిని సేవించుకున్నారు. నాగుల చవితిని పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ క్రమంలోనే ఉచిత అన్నప్రసాద కేంద్రం వద్ద సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేపట్టారు. ఉచిత అన్న ప్రసాద నిర్వహణకు దాతలు సహకరించాలని చైర్మన్ కోరారు.